# 6

# క్రీస్తు: వ్యసనాక్రాంతుడు

"అతడు తృణీకరింపబడినవాడును ఆయెను, మనుష్యుల వలన విసర్జింపబడినవాడును వ్యసనాక్రాంతుడుగాను వ్యాధిననుభవించినవాడుగాను మనుష్యులు చూడనొల్లనివానిగాను ఉండెను, ఆతడు తృణీకరింపబడినవాడు గనుక మనము అతనిని ఎన్నికచేయకపోతిమి": యెషయా 53:3 మెస్సీయ సంబంధిత ప్రవచనమై యున్నదనుటకు ఎటువంటి సందేహాత్మక ప్రశ్నయైనను లేదు. ఈ వచనం మెస్సీయ, క్రీస్తు, అభిషేకింపబడిన వాని గూర్చి చెప్పుచున్నదని మనమెరుగుదుము. ఫిలిప్పు వాని రథమును చేరుకొనినప్పుడు, ఐతియొపీయుడైన నపుంసకుడు చదువుచుండిన వాక్యభాగము ఇదే; ఈ వాక్యభాగముతో ఫిలిప్పు "అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను" (అపొస్తలుల కార్యములు 8:35).

మెస్సీయ "వ్యసనాక్రాంతుడు మరియు వ్యాధిననుభవించినవాడునై" యుండవలసి యుండెను. నీ జీవితము దుఃఖము మరియు బాధతోనిండియున్నట్లు నీవెప్పుడైనా అనుభూతిచెందావా? అలాగైతే, రక్షకుడు, యేసు క్రీస్తు – ప్రవక్త, యాజకుడు, మరియు రాజునైన దేవుని కుమారుడు – సహితము దుఃఖముతో నిండియుండిన జీవితము జీవించాడని తెలిసికొని నీవు బహుగా ఓదార్పు పొందవచ్చును. యేసు "వ్యసనాక్రాంతుడు" అయియుండెనని మనము అర్థంచేసికొనవలెను. ఆయనను వెంబడించుచున్నవారముగా, ఆశాభంగములు మరియు సంతోషములేని క్షణములు అనుభవించకుండా జీవించుటకు మనము అపేక్షించకూడదు.

### ఆయన అనుభవించిన దుఃఖములలో గల విచిత్రం

యేసు క్రీస్తు ఎలా "ఒక వ్యసనాక్రాంతుడు" అయియుండెనో చూడక మునుపు, దాని గూర్చిన భావన ఒక వింతైనదై యున్నదని మనము గుర్తించవలసి యున్నది. మెస్సీయయైనవాడు, దేవుని చేత అభిషేకింపబడినవాడు, వ్యసనము మరియు బాధతో కూడిన లక్షణములు గల జీవితమును ఎందుకు జీవించవలెను?

*ఇటువంటి అభిప్రాయము యూదులకు వింతైనదిగా అగుపించియుండును.* వారు ఒక విజయీభవుడైన మెస్సీయ కొరకు, తన శత్రువులను ఆయన కాళ్ల క్రింద అణగద్రొక్కి ఇశ్రాయేలుకు దావీదు రాజ్యమును మరలా పునఃస్థాపనంచేయు యుద్ధశాలియైన మెస్సీయ కొరకు ఎదురుచూస్తారు. ఇటువంటి మెస్సీయా తన విజయములనుబట్టి అట్టహాసంగా ఆనందిస్తూ తన సఫలతలనుబట్టి సంతోషంగా సంబరములు జరుపుకొనును. ఆయన జీవితంలో దుఃఖము కలుగుటకు హేతువుండదు, బాధనొందుటకు చోటుండదు.

*ఈ అభిప్రాయము నేటి ప్రజలకు సహితము వింతైనదిగా అగుపించుచున్నది.* ఎవరైనాగాని "ఒక వ్యసనాక్రాంతునిని" ఎందుకు శ్లాఘిస్తారు లేక వెంబడించవలెనని ఎందుకు ఆశిస్తారు? యేసు తరుచుగా వ్యసనమును అనుభవించాడు; మరియు తన జీవితాంతములో, ఆయన సిలువవేయబడినాడు, ధనవంతులు మరియు పేరుప్రఖ్యాతులు గల

వారి అనుకూల స్థితిగతుల దృష్ట్యా, ఆయన ఒక విఫలుడై యుండెను. (ఆయన మృతులలో నుండే లేపబడినంత వరకు కూడా ఇది కచ్చితంగా వాస్తవమైనదిగానే అగుపించినది – కానీ ధనవంతులు మరియు పేరుప్రఖ్యాతిగాంచినవారు, అత్యధికంగా, పునఃరుత్థానమును అంగీకరించలేదు.) విఫలుడైనవానిని ఎవరు హర్షిస్తారు? ఓడిపోవువానిని వెంబడించుటకు ఎవరు ఇష్టపడుతారు? జీవితమంతా వ్యసనముతో నిండి యున్న ఒకనిని మనము చూచునప్పుడు మనము అతని గూర్చి తాళుకొనవచ్చును లేక జాలిచూపించవచ్చును, కానీ మనము అతనిని ప్రశంసించుటకు లేదా అతనిని వెంబడించుటకు అవకాశము లేదు.

జి. సి. బ్రూవెర్ ఈ అభిప్రాయమును ఇలా వ్యక్తము చేసాడు:

> "వ్యసనాక్రాంతుడైన ఒకడు ... లోకమునకు ఆదర్శప్రాయమై యుండునా? నిట్టూర్పులు విడుచుచు, దుఃఖము చేత నిండియుండి, ఏడ్చుచుండువాని యెదుటికి వచ్చి మానవులు వంగి నమస్కరించుటకు ఆశిస్తారని నీవనుకొందువా? మానవుని స్వభావము అది కాదు; మనము ఒకలమైనవాడు, నిర్భయస్తుడు, ఎవరికీ లొంగనివాడు మనకు కావాలి. మనము వీరపూజచేయువారమై యున్నాము ... ."
>
> ... బలము మరియు సాహసంగల వారిచే మనము బాగా ఆకర్షితులమగుచు మనస్సులు రంజింపజేయబడుచున్నాము: దేనికీ భయపడక ప్రతి దానిని సాహసోపేతంగా ఎదుర్కొనువారి చేత ... .
>
> లోకం శౌర్యముతో నిండినయున్న కట్టు కథలు వినుటకు అతిగా ఇష్టపడుచున్నది ... గంభీరము, పవిత్రము మరియు మనస్సును కరిగించెడు విషయాలకు బదులుగా, సుళువైనవి మరియు ఆహ్లాదము కలిగించునవి మరియు వినోదం కలిగించు విషయాలను లోకము కోరుకొనుచున్న సంగతి కూడా వాస్తవమే. మనుష్యులు వెక్కివెక్కి ఏడ్చుటకు మరియు మూలుగుటకు బదులుగా సంగీతప్రియులగుచు హాస్యంతో కూడిన నవ్వులాటను ప్రేమించుచున్నారు.[1]

అది వింతైనదిగా అగుపించుచున్నప్పటికిని, యేసు "ఒక వ్యసనాక్రాంతుడు" అయియుండెను మరియు మనుష్యులందరు ఆరాధించుచు సేవించవలసిన మెస్సీయ, రాజు, ఆయనే అని మనము ప్రకటించుచున్నాము!

## ఆయనకు వ్యసనములు కలిగిన సందర్భములు

యేసు ఎందుకు "ఒక వ్యసనాక్రాంతుడు" అయియుండెను? ఆ వ్యసనము ఎందువలన కలిగినది?

*మొదటిదిగా, ఒక మానవుడుగా, ఆయన అందరూ అనుభవించు అదే విధమైన అనేక దుఃఖములు అనుభవించాడని, మనము నిస్సంకోచంగా భావించుకొనవచ్చును.* బహుశా, ఆయన నజరేతు నగరంలో పెరిగి పెద్దవాడగుచుండగా, యౌవనులకు సామాన్యంగా ఎదురగు అనేక ఆశాభంగములను ఆయన ఎరిగియుండును. ఆయన కుటుంబ సభ్యులలో లేక పొరుగువారిలో లేక స్నేహితులలో కొందరు మరణించి యుందురు, గనుక ఆయన ప్రియులైనవారి మరణము కలుగజేయు దుఃఖపూరితమైన బాధను తట్టుకొనవలసిన పరిస్థితులేర్పడి యుండును. ఆయన జీవితము ప్రతి ఇతరుని జీవితము వంటిదై యుండినందునుబట్టి – ఆయన ఏ పాపమునైనను చేయలేదను విషయం మినహాయించి – లోకములో ప్రతిచోట నున్న ప్రతి ఒక్కరు సామాన్యంగా అనుభవించు గాయములు మరియు

నష్టములకు గురికాకుండా ఆయన కాపాడబడినవాడు కాదు.

*రెండవదిగా, యేసు దుఃఖమును అనుభవించిన పెక్కు సందర్భములను, ఆయన కన్నీరు కార్చునట్లు చేసిన సందర్భములను, సువార్తలు వర్ణించుచున్నవి.* ప్రతి సందర్భములోను, ఆయన అనుభవించిన దుఃఖమునకు గల హేతువు గమనార్హమైనదై యున్నది.

1. యెరూషలేము ఆయనను తృణీకరించుటనుబట్టి యేసు దుఃఖమును వ్యక్తము చేసాడు. మత్తయి 23:37-39లో, యేసు యెరూషలేము గూర్చి విలపించిన విషయాన్ని మనము చూడగలము:

> "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంపబడినవారిని రాళ్లతో కొట్టుచును ఉండుదానా! కోడి తన పిల్లలను రెక్కల క్రిందికేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నో మారులు చేర్చుకొనవలెనని యుంటిని, గాని మీరు ఒల్లకపోతిరి. ఇది మొదలుకొని, 'ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడుగాకని' మీరు చెప్పువరకు నన్ను చూడరని మీతో చెప్పుచున్నాను!"

యేసు పై మాటలను ఉచ్చరించినప్పుడు, ఆయన స్వరంలో వ్యక్తమగుచుండిన బాధను మరియు కళ్లలోని కన్నీరు తెలుపుచుండిన వేదనను మనము ఊహించుకొనవచ్చును. ఆయనకెందుకంత బాధ? ఎందుకనగా ఆయన యెరూషలేము ప్రజలను ఎంతో ప్రేమించాడు. వారిని రక్షింపగోరాడు, మరియు రక్షింపబడుటకు వారు తృణీకరించినందు వలన నిండుగా మెండుగా బాధనొందాడు.

యేసు మానవాళి కొరకు ఎంత గొప్ప ప్రేమ కలిగియుండెను కదా! యెరూషలేము యేసుకు ఏమీ (ఏ మేలును) చేయలేదు; మొత్తముమీద, అచ్చటి వాస్తవ్యులు ఆయనను తృణీకరించారు, మరియు వారు త్వరలోనే ఆయనను సిలువవేయుదురని యేసు ఎరిగియుండెను. అయినప్పటికిని, యేసు వారిని ఎంతో ప్రేమించాడు గనుక ఆయన వారిని రక్షింపగోరాడు. అయితే ఆయన అనుగ్రహించుచుండిన ఆశీర్వాదములను అంగీకరించుటకు వారు అయిష్టపడుట ఆయన వారిని రక్షింపకుండుటకు అడ్డువచ్చిన ఒకే ఒక విషయమై యున్నది. ఆయన యొద్దకు వచ్చుటకు నిరాకరించిన పాపుల గూర్చి యేసు పరితాపము నొందుచు ఏడ్చాడు.

2. యేసు లాజరు సమాధి యొద్ద ఆయనకు కలిగిన దుఃఖమును బయటకు అగుపర్చాడు. లాజరు మరణము గూర్చిన వివరము యోహాను 11వ అధ్యాయం తెలియజెప్పుచున్నది. లాజరు మరియు అతని ఇద్దరు సహోదరీలు, మరియ మరియు మార్త, బేతనియలో నివసించుచుండిరి మరియు యేసునకు ప్రియమైన స్నేహితులై యుండిరి (యోహాను 11:5). లాజరు అనారోగ్యస్తుడైనందున అతని అనారోగ్య పరిస్థితి గూర్చిన వార్తను అతని ఇద్దరు సహోదరీలు యేసునకు కబురంపినప్పుడు, యేసు ప్రభువు వెంటనే బయలుదేరి రావాలని మరియు రాగానే లాజరును స్వస్థపర్చాలని వారాశించారు. దానికి బదులుగా, యేసు ఆయన ఉన్న చోటనే ఉండిపోయి బేతనియకు బయలుదేరక మునుపు యింకా రెండు రోజులు జాప్యం చేసాడు. ఆయన బేతనియకు వచ్చేటప్పటికే, లాజరు మృతిచెంది నాలుగు రోజులు గతించిపోయాయి (యోహాను 11:17). మార్త మరియు మరియ, యేసు రాగానే, "ప్రభువా, నీవిక్కడ ఉండిన యెడల, నా సహోదరుడు చావకుండును" అని పలికారు

(యోహాను 11:21, 32). ఆ తరువాత వ్రాయబడియున్న వాక్యభాగము ఈ విధంగా ఉన్నది,

> ఆమె [మరియ] ఏడ్చుటయు, ఆమెతో కూడ వచ్చిన యూదులు ఏడ్చుటయు, యేసు చూచి కలవరపడి ఆత్మలో మూలుగుచు, "అతని నెక్కడనుంచితిరి" అని అడుగగా, వారు "ప్రభువా, వచ్చి చూడుము" అని ఆయనతో చెప్పిరి. యేసు కన్నీళ్లు విడిచెను. కాబట్టి యూదులు, "అతనిని ఏలాగు ప్రేమించెనో చూడుడి" అని చెప్పుకొనిరి (యోహాను 11:33-36).

"యేసు కన్నీళ్లు విడిచెను" (యోహాను 11:35): ఈ వచనం బైబిలంతటిలో అతి చిన్న వచనమై యున్నది, కానీ అది ఎంతో గొప్ప అర్థవంతమైనదై యున్నది. యేసు ఎందుకు ఏడ్చాడు? యేసు లాజరును అత్యధికంగా ప్రేమించినందునుబట్టియే ఆయన ఏడ్చుచుండెనని యూదులు అనుకొన్నారు, ఇది పాక్షికంగా సత్యమే. ఏదిఏమైనా, ఆయన అతి త్వరలో లాజరును మృతులలో నుండి లేపబోవుచున్నాడని యేసు ఎరిగియుండినందు వలన (యోహాను 11:11), లాజరు మృతిచెందియున్నాడను వాస్తవము ఆయన అంతగా ఏడ్చుటకు కారణమైయుండదు. కానీ, ఇతరులు సహితము ఏడ్చుచుండుట గమనించుచుండిన యేసు తన సహానుభూతిని తెలియజేయుటకు కన్నీరు కార్చాడు. వారికి కలుగుచుండిన దుఃఖమును వారితోపాటు ఆయన కూడ అనుభూతిచెందాడు. యేసు తదనుభూతిని అనుభవించాడని చెప్పుకొనుట ఉత్తమము. వారికి కలుగుచుండిన దుఃఖమునే ఆయన కూడ అనుభవించుచుండెను. కాబట్టి, ఆయన ఏడ్చాడు.

3. ఆసన్నమగుచుండిన ఆయన మరణము గూర్చి యేసు తన దుఃఖమును అభివ్యక్తము చేసాడు. ఆయన మరణ గడియలు సమీపించుచుండగా, యేసు కలవరపడెనని సువార్తలు మామూలుగా మనకర్థమయ్యేలా తెలియజెప్పుచున్నవి. యోహాను 12:27, 28లో ఇలా వ్రాయబడి యున్నది,

> "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది; నే నేమందును, 'తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము'? అయినను ఇందుకోసమే నేను ఈ గడియకు వచ్చితిని. తండ్రీ, నీ నామము మహిమపరచుము" అని చెప్పెను. అంతట: "నేను దానిని మహిమపరచితిని, మరల మహిమపరతును" అని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను.

యోహాను 13:21 ప్రకారము, యేసు "ఆత్మలో కలవరపడి, 'మీలో ఒకడు నన్ను అప్పగించునని, మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని' రూఢిగా చెప్పెను."

యేసునకు ముందుండిన ఆయన మరణము – ఆయన అనుభవించనై యుండిన నొప్పి మాత్రమే కాదు, కానీ దానిలో దాగియుండిన ఆశాభంగములు సహితము – ఆయనకు వ్యసనము కలుగజేసినది. వాగ్దానము చేయబడిన రాజ్యమును ఆయన ప్రవేశపెట్టనై యున్నాడని అంతాచేసిన తరువాత కూడ వారు ఆయనను తృణీకరించుటనుబట్టి ఆయన దుఃఖించాడు. ఇంతేగాక, ఎడతెరపిలేకుండా మూడు సంవత్సరములు వారితో కూడ సహవసించుచూ బోధించిన తరువాత, ఆయన శిష్యులు త్వరలో ఆయనను అప్పగిస్తారు, ఎరుగనని బొంకుతారు, మరియు ఆయనను ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లిపోతారని ఆయనకు ఎరుకయ్యింది. గనుక ఆయన కలవరపడుటలో ఆశ్చర్యమేమున్నది!

సహజంగానే, “ఒక వ్యసనాక్రాంతుడు”గా క్రీస్తు యొక్క చిట్టచివరి చిత్రీకరణము గెత్సేమనే తోటలో చిత్రీకరింపబడినది. ఈ దృశ్యమును మార్కు వ్రాసిన సువార్త ఇలా వర్ణించుచున్నది:

> “వారు గెత్సేమనే అనబడిన చోటునకు వచ్చినప్పుడు, ఆయన – నేను ప్రార్థనచేసి వచ్చువరకు మీరిక్కడ కూర్చుండుడని” తన శిష్యులతో చెప్పి పేతురును యాకోబును యోహానును వెంటబెట్టుకొనిపోయి, మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను. అప్పుడాయన – నా ప్రాణము మరణమగునంతగా దుఃఖములో మునిగియున్నది; మీరిక్కడ ఉండి మెలకువగా నుండుడని వారితో చెప్పి

స్పష్టంగా, ఈ సందర్భంలో యేసు “ఒక వ్యసనాక్రాంతుడు” అయియుండెను. ఆయన కన్నీరు కూడా కార్చాడా? “శరీరధారియై యున్న దినములలో, మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించాడు, …” అని హెబ్రీ పత్రిక రచయిత చెప్పుచున్నాడు (హెబ్రీయులకు 5:7ఎ).

యేసు గెత్సేమనే వనములో అనుభవించిన దుఃఖము ముమ్మందుండిన అగ్నిపరీక్షకు సంబంధించినదై యుండెను. ప్రజలు చావును ఎదుర్కొనునప్పుడు వారు సర్వసాధారణంగా అనుభవించు దుఃఖమును ఆయన కూడా అనుభూతిచెందాడు. సిలువవేయబడినవారు ఎరిగియుండిన మరణము కలుగజేయు శూలనొప్పిని, సిలువ మీద, ఆయన పంచుకొన్నాడు. ఏదిఏమైనా, దానిని మించి, ఆయన మానవాళి పాపమును భరించాడు. ఏ పాపము చేయనివాడు ఇప్పుడు పాపమయ్యాడు; మన సమస్త పాపములనుబట్టి ఆయన శిక్షింపబడెను (2 కొరింథీయులకు 5:19–21). ఈ వాస్తవము ఆయన బాధను సిలువమరణము నొందిన ఇతరులు అనుభవించిన దాని కంటె మరి ఎక్కువ తీవ్రతరము చేసినది.

## ఆయన వ్యసనముల ప్రాముఖ్యత

ఇహ లోక జీవితంలో యేసు అనుభవించిన వ్యసనములు మనకేమని అర్థమిచ్చుచున్నవి? ఆయనను వెంబడించుచున్నవారముగా, ఆయన విలువలను మనము పంచుకొనవలసి యున్నది; ఆయనకు దుఃఖము కలుగజేసిన ప్రతి విషయమునుబట్టి మనము కూడ దుఃఖించవలెను.

1. యేసు యెరూషలేము గూర్చి విలపించిన విషయము పాపము యొక్క గాంభీర్యమును మరియు అట్టి పాపములో నుండి మనలను రక్షింపవలెనని ఆయన కలిగియున్న కోరికను ప్రదర్శించుచున్నది. మత్తయి 23:37లోను లూకా 13:34లోను వ్రాయబడిన ఆయన మాటలు శోకము మరియు పాపమునకు సంబంధించిన రెండు సత్యములను తేటపర్చుచున్నవి. *మొదటిగా, పాపులు నశించినప్పుడు, వారి పాపముల నుండి వారిని రక్షించగల ఒకే ఒక్కనిని తృణీకరించుటకు వారు ఎంపికచేసికొనుటయే ఎల్లప్పుడు వారు నశించుటకు గల కారణమై యున్నది.* ప్రతి ఒక్కరు రక్షింపబడవలెనని యేసు కోరుచున్నాడు: “ఎవడైనను” ఆయన శిష్యుడు కావచ్చును (మత్తయి 16:24); ఇష్టపడుచున్న “ఎవడైనను” ఆయన యందు విశ్వసించి రక్షింపబడవచ్చును (యోహాను 3:16). “అందరు” మారుమనస్సు పొంది రక్షింపబడవలెనని దేవుడు కోరుచున్నాడు (2 పేతురు 3:9). క్రీస్తు ద్వారా సమకూర్చబడిన కృపాసహితమైన రక్షణ ప్రతిపాదనను కొందరు తృణీకరించుట అందరు రక్షింపబడకపోవుటకు గల ఒకే ఒక

కారణమై యున్నది! ఆయన తన శత్రువులను సహితము రక్షింపవలెనని ఈ లోకమునకు వచ్చాడు, కానీ వారు "ఒల్లరైరి" అదే విధంగా తమ్మును తాము యేసునకు అప్పగించుకొని రక్షింపబడుటకు ఇష్టపడనివారు ఈ రోజుల్లో కూడ కొందరున్నారు. రెండవదిగా, క్రీస్తును తృణీకరించుట దుఃఖమునకు మూలకారణమై యున్నది. మారుమనస్సు నొంది ఆయన వైపు మళ్లుటకు ప్రజలు నిరాకరించినప్పుడు మనము యేసు అనుభవించిన దుఃఖమును పంచుకొనవలెను. పాపుల యెడల యేసుని ప్రియమెట్టిదో అదే ప్రేమను మనము కూడ వారి పట్ల కలిగియుండవలెను. తప్పిపోయిన గొఱ్ఱె, పోగొట్టుకొనబడిన నాణెము, మరియు తప్పిపోయిన కుమారుల గూర్చిన ఉపమానములలో నుండి (లూకా 15) ఇది మనము నేర్చుకొనుటకు ఉద్దేశింపబడిన ఒక పాఠమై యున్నది. యేసు ప్రేమించుచున్నట్లే మనము కూడ పాపులను ప్రేమించినప్పుడు, రక్షణ ప్రతినాదనను వారు నిరాకరించుటనుబట్టి ఆయన ఏడ్చినట్లే మనము కూడా ఏడుస్తాము.

2. మనము ఏడ్చినప్పుడు యేసు మనతో కూడ తన సహానుభూతిని తెలియజేయునని *యేసు లాజరు సమాధి యొద్ద అనుభవించిన దుఃఖము చూపించుచున్నది.* లాజరు సమాధి యొద్ద ఏడ్చుచుండిన వారితోపాటు ఆయన ఏడ్చినట్లే, మనము దుఃఖించినప్పుడు మన దుఃఖమును సహితము ఆయన అనుభూతి చెందును. ఇతరులు దుఃఖించినప్పుడు మనము కూడ తదనుభూతిని లేదా సహానుభూతిని అనుభవించుచున్నవారమై యుండుట ద్వారా మనము ఆయన చూపిన మాదిరిని అనుకరించవలెను. "సంతోషించు వారితో సంతోషించుడి, మరియు ఏడ్చువారితో ఏడ్వుడి" అని పౌలు వ్రాసాడు (రోమీయులకు 12:15).

3. *మన రక్షకుడు మన రక్షణ నిమిత్తము అమూల్యమైన మూల్యము చెల్లించాడని* యేసు గెత్సేమనే తోటలో అనుభవించిన దుఃఖము మనకు గుర్తుచేయుచున్నది. ఆయన వేదనను అర్థంచేసికొనుటకు మనము ప్రయత్నించునప్పుడు, మనలను మన పాపముల నుండి విడిపించి స్వతంత్రులనుగా చేయుటకు అట్టి అనుభవమును సహితము అనుభవించుటకు ఆయన ఇష్టపడుచుండెనని మనము సంతోషించి ఆనందించవలెను ఒకే సమయంలో విరుద్ధమైన భావాలు కలుగుచుండగా, ఆయన గెత్సేమనే వనములో అనుభవించిన దుఃఖమునుబట్టి మనము సంతోషించవచ్చును. ఆయన కార్చిన కన్నీరు మన రక్షణ మార్గమును సరాళము చేసినది.

## ముగింపు

యేసు క్రీస్తు నిజముగా "ఒక వ్యసనాక్రాంతుడు" అయియుండెను. ఏదిఏమైనా, దుఃఖపూరితమైన ఆయన జీవితములో నుండి గొప్ప దీవెనలు పుట్టుకొచ్చినవి. పాపమనెడి ఊబిలో పడిపోయి నశించుచుండిన వారి పరిస్థితి గూర్చి ఏడ్చునంతగా యేసు వారిని ప్రేమించినందు వలన మనము దీవింపబడుచున్నాము. ఒక స్నేహితుని మరణమునుబట్టి ఏడ్చునంతటివాడును మనతో కూడ మన దుఃఖములను అనుభవించుటకు చాలిన మానవుడై యుండెనని తెలిసికొనుచు మనము దీవింపబడుచున్నాము. ముఖ్యముగా, మనకు క్షమాపణను మరియు నిత్యజీవమును సంపాదించుటకు గెత్సేమనే వనములోని దుఃఖమును మరియు గొల్గొతాలోని వేదనను అనుభవించుటకు యేసు కనుపర్చిన ఇష్టము ద్వారా మనము దీవింపబడుచున్నాము. ఆయన దుఃఖములో నుండి మనకు రక్షణ కలిగినది.

యేసు ఎదుర్కొన్న అగ్నిపరీక్షలు మరియు ఆశాభంగములు, ఆయనకు కలిగిన బాధ మరియు దుఃఖము, మరియు ఆయన అనుభవించిన వేదనతో కూడిన సిలువ మరణము జీవమును – అంతులేని, నిత్య జీవమును – ఉద్భవింపజేసినవి. ఆయన మరణించిన పిదప పునరుత్థానుడయ్యాడు; పునరుత్థానుడైన తరువాత ఆరోహణుడై మహిమపర్చబడినాడు. విశ్వసనీయమైన క్రైస్తవునికి, అతడనుభవించు కష్టము మరియు హింసలతో కూడిన జీవితము అతనికి నిత్య మహిమయను కిరీటమును తెచ్చిపెట్టును! యేసు మార్గమే నిత్య జీవమునకు బాటయై యున్నది (యోహాను 14:6; 11:25, 26). ఆయన దుఃఖము మనకు జీవమైయున్నవానిని వెంబడించుటకు మనము సంతోషించవలెను!

---

సూచన

[1]G. C. Brewer, "Christ, The Man of Sorrows," *Christ Crucified – A Book of Sermons* (Nashville: B. C. Goodpasture, 1952), 72-73.